క్లుప్తంగా

మేయర్‌కు ఆహ్వానం



వరంగల్ అర్బన్: భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మేయర్ గుండు సుధారాణిని ఆహ్వానించారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆమెను ఆలయ ధర్మకర్త శేషు, ఈఓ భారతి గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 22నుంచి మే 3వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

శ్రీనివాస్‌రావుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగం పరిశోధకుడు శ్రీనివాస్‌రావు నర్రాకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. మల్టిఫెసెటెడ్ మానిఫెస్టేషన్స్ ఆఫ్ ది కడపా ఇంట్రూసివ్ ప్రావిన్స్ – ఏ కంపారేటివ్ అండ్ కాంప్రహెన్సివ్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీనివాస్‌రావు నర్రాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. జియాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.డేవిడ్ పర్యవేక్షణలో శ్రీనివాస్‌రావు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు

కాశోజీ సెంటర్: ఖిలా వరంగల్ మండలం కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8 తరగతుల విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలను పై తరగతుల విద్యార్థుల చేత పార్ట్ బి సమాధాన పత్రాలను దిద్దించినట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఓ విజయ్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించగా ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థుల చేత పార్ట్ బి సమాధాన పత్రాలను దిద్దించినట్లు గుర్తించగా జీహెచ్ఎస్ కరీమాబాద్ పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.సుదర్శన్(ఎస్ఏ, బయోసైన్స్), డి.రవి(ఎస్ఏ,ఇంగ్లిష్)లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వాసంతి వివరించారు.

కమీషన్ చెక్కుపై విచారణ



హసన్‌పర్తి: నాగారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ నిమిత్తం విడుదలైన కమీషన్ చెక్కుపై నెలకొన్న వివాదంపై డీఆర్‌డీఓ అధికారులు విచారణ చేపట్టారు. రెండు రోజులుగా విచారణ సాగుతోంది. ఈమేరకు హసన్‌పర్తిలోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయాన్ని డీపీఎం మార్కెటింగ్ ప్రకాష్ గురువారం సందర్శించారు. ఏపీఎం, మహిళా సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా మాట్లాడారు. కంప్యూటర్‌లో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు.

సమాచార సేకరణ గడువు పెంపు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం ఉన్న సభ్యుల సమగ్ర సమాచార సేకరణకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పెంచుతున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్ యూనియన్ పెద్దల సూచనలు, రంజాన్ పండుగ దృష్ట్యా గడువును పెంచినట్లు పేర్కొన్నారు. సభ్యులకు పారదర్శకంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందజేయాలనే సదుద్దేశంతో సభ్యుల పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు.

రైల్వే గ్యాంగ్‌మెన్ల ట్రాక్ ప్యాకింగ్



కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్ సమీపంలో రైల్వే గ్యాంగ్‌మెన్లు గురువారం ట్రాక్ ప్యాకింగ్ బ్లాక్ చేపట్టారు. సుమారు 30మంది గ్యాంగ్‌మెన్లు ఇంజనీరింగ్ కిట్టు పరికరాలతో ట్రాక్‌ను, ట్రాక్ కింద ఉన్న కంకరను, ట్రాక్ జాయింట్‌ల వద్ద బోల్టులను పటిష్టం చేసి ట్రాక్ ప్యాకింగ్ చేసినట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

నిధులు కేటాయించాలి

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో పక్కా భవన నిర్మాణానికి నిధులు వెంటనే కేటాయించాలని సామాజికవేత్త, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు కోరారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్



దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మ



సామగ్రి అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

కరీమాబాద్: మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్‌లోని హెచ్ఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే 43, 44వ డివిజన్లకు చెందిన ముస్లింలకు ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ, బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

శంభునిపేటలో..

ఖిలా వరంగల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ శంభునిపేటలోని జామా మసీద్ మహ్మదీయ ప్రాంగణంలో ప్రభుత్వ ముస్లిం, మైనార్టీ శాఖ పంపిణీ చేసిన దుస్తులను మసీదు అధ్యక్షుడు ఎండీ.హైమద్‌ఖాన్ నేతృత్వంలో పేద ముస్లింలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పోశాల పద్మ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పోశాల స్వామిగౌడ్, మసీదు కార్యదర్శి ఎండీ.మహిమూద్ అలీ, మిర్జా నసీర్ ఉల్లాబేగ్, ఎండీ.సలార్, ఖలీయర్, ఖలీమ్, ఫహీమ్, అశ్రఫ్, సర్వేర్‌బేగ్, సుల్తాని, మోహిన్, నూరుల్లా, ముజ్జు, ఖాజామోహనొద్దీన్, ఎండీ.లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పడమర కోటలో..

వరంగల్ పడమరకోటలో కాకతీయ రుద్రమాంబ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బైరబోయిన సరోజన, కృష్ణమూర్తియాదవ్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ సామగ్రి సేమియా ప్యాకెట్లు, చెక్కర, పండ్లను గురువారం పంపిణీ చేశారు. సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథులుగా స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మామునూరు మాజీ సర్పంచ్ సింగారపు అరుణకుమార్ హాజరయ్యారు.

రంజాన్ సామగ్రి అందజేత

హసన్‌పర్తి: రంజాన్ సందర్భంగా నగరంలోని ఒకటవ డివిజన్ ముచ్చర్ల గ్రామంలోని నిరుపేద ముస్లింలకు గురువారం పండుగ సామగ్రిని అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి తన తల్లి పూలమ్మ జ్ఞాపకార్థం సామగ్రిని పంపిణీ చేశారు. ఈమేరకు ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూర ప్రమోద్, కన్నబోయిన రాజుయాదవ్, శ్రీధర్, రాజేష్, పాల్, శ్రవణ్, కర్ణాకర్, రాజేష్, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఐవీఎఫ్ చేయూత



బియ్యం పంపిణీ చేస్తున్న ఐవీఎఫ్ ప్రతినిధులు

రామన్నపేట: పేద కుటుంబాలకు అండగా నిలువడమే ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ధ్యేయమని టూరిజం శాఖ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. నగరంలో గురువారం ఆయన పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాత శివకుమార్ అనే కుటుంబ సభ్యులకు 50కిలోల బియ్యంతో పాటు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే, హనుమకొండ రాంనగర్‌లో కందిమల్ల వనజవాణి అనే పేద మహిళకు జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఐవీఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్ తల్లి ప్రమీణ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట హరీశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, జనగామ అధ్యక్షుడు బిజ్జల నవీన్, ములుగు అధ్యక్షుడు బాదం ప్రవీణ్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్, బిజ్జా శ్రీనివాస్, గుమ్మడవెల్లి సురేష్, ఎలగందుల రాజేందర్, తోనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య పాల్గొన్నారు.

23నుంచి శ్వేతార్కలో రజతోత్సవాలు



మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ

కాజీపేట: శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఈనెల 23నుంచి 27వరకు జరగనున్న 25వ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ కోరారు. ఈమేరకు ఆలయంలో భక్తులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామి వారి పుట్టినరోజును పురస్కరించుకుని కనులపండువగా సాగే వసంత ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందని వివరించారు. తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి, ఆలయ వ్యవస్థాపకుడు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతితో పాటు రాష్ట్రం నలుమూలాల నుంచి భక్తులు వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు, చిన్నారుల నృత్యాలు, గణపతి కోటి నామాల పారాయణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈమేరకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు సాయికృష్ణశర్మ, ఆలయ మేనేజర్ రవి, దుర్గం సుధీర్, పీఆర్వో మణిదీప్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లపై దాడులు చేస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

కాశిబుగ్గ: రైళ్లు, రైల్వే ఆస్తులపై దాడులు చేయరాదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత తామందరిపై ఉందని వరంగల్ ఆర్పీఎఫ్ సీఐ టీఎస్ఆర్.కృష్ణ సూచించారు. ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో యాకుబ్‌పురలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు హైదరాబాద్ మేరి కళా బృందం సభ్యులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చాలా చోట్ల రైళ్లపై దాడులు చేయడంతో ప్రయాణికులకు గాయాలు, రైల్వే ఆస్తులకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైళ్లు, రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే రైల్వే అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

యూనియన్ నిర్ణయించిన వేతనాలు ఇవ్వాలి



నయీంనగర్: యూనియన్ నిర్ణయించిన వేతనాలను ప్రైవేట్ విద్యాసంస్థల యజమాన్యాలు చెల్లించాలని తెలంగాణ ఓరుగల్లు ప్రైవేట్ విద్యాసంస్థల బస్ డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డిపాటి సారయ్య, బండి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా డ్రైవర్‌కు కనీస వేతనం రూ.21 వేలు, క్లీనర్‌కు 12 వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పూజారి హరిప్రసాద్, పాకాల చొక్కారావు, బెనర్జీ, దిడ్డి నాగభూషణం, ఎం.రాజు, జన్ను సంజీవ, లింగమూర్తి, ఆర్.రాజు, సురేష్, భిక్షపతి పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా ‘సఖి’



మాట్లాడుతున్న సఖి సిబ్బంది

కాజీపేట అర్బన్: ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు అండగా సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలందిస్తోందని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల తెలిపారు. కాజీపేట మండలం కుమ్మరిగూడెం గ్రామంలో మహిళా చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, వినీల మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వరకట్న, లైంగిక వేధింపులకు గురయ్యే బాధితులకు లీగల్, వైద్య, పోలీస్, న్యాయ సేవలందిస్తున్నట్లు వివరించారు. ఆపదలోని మహిళలు, బాలికలు 181 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 0870 2452112 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

భద్రకాళి బ్రహ్మోత్సవాలకు తరలిరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న భద్రకాళి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విశ్వబ్రాహ్మణులు కుటుంబ సమేతంగా తరలిరావాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి కోరారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఆవిష్కరించారు. విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు విశ్వబ్రాహ్మణ కుటుంబాలు తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పెండోట చక్రపాణి, సురేష్, వీణవంక సదానందం, గజ్జెల వీరన్న, చక్రపాణి, రామోజు నాగసోమేశ్వర్, డాక్టర్ విష్ణువర్ధన్, నాగరాజ, వెంకటేశ్వర్లు, భిక్షపతి, శశిరేఖ, హేమలత, భారతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అభిప్రాయం సేకరించకుండానే విస్తరణ పనులా?



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న శ్రీధర్

హసన్‌పర్తి: ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండానే ఏకపక్షంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని, దీంతో నిరుపేదలు, బాధితులు రోడ్డున పడుతున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశారు. భీమారం మెయిన్ సెంటర్ నుంచి బొడ్రాయి వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలతో చర్చించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇళ్లు కూల్చివేస్తున్నారని బాధితులు తెలిపారు. అనంతరం, శ్రీధర్ మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ ఏకపక్ష నిర్ణయం తీసుకుని నిర్మాణాలు కూల్చివేస్తున్నారని విమర్శించారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకపోవతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బూర సురేందర్‌గౌడ్, నాయకులు శ్రవణ్, వినీత్, శివకుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి రంజాన్ పండుగకు ఏర్పాట్లు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జబ్బార్, తదితరులు

ఖిలా వరంగల్: నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేసిన ముస్లింలు.. రంజాన్ పండుగను శనివారం వైభవంగా నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం రాత్రి నెలవంక కనిపిస్తే శనివారం ఉదయం సామూహిక ప్రార్థనలు జరుపుకోవాలని ముస్లిం మత పెద్దల కమిటీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో ఏర్పాట్లు చేశారు. ప్రార్థన స్థలాల్లో టెంట్లు, షామియానాలు వేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు వారి కుటుంబ సభ్యుల సమాధులను దర్శించుకునేలా కబరస్థాన్లను ముస్తాబు చేశారు. ఇప్పటికే మసీదులు, ఈద్గాలు, కబరస్థాన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముస్లింలు సకాలంలో చేరుకోవాలి

శనివారం 9.30 గంటలకు జరగనున్న సామూహిక ప్రార్థనలకు ముస్లింలు సకాలంలో చేరుకోవాలని ఈద్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో ఈద్గా అభివృద్ధి కమిటీ కార్యదర్శి చాంద్‌పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ప్రతినిధులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో 36 వేలమంది ఏకకాలంలోనే సామూహిక ప్రార్థనలు చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు ముగ్దుం, దస్తగిరి, యాకూబ్, నసీర్, మాషూక్, అశ్రఫ్, అమ్జద్‌ఖాన్, ఎండీ.అజీమ్, ఎండీ.యాకూబ్, మోహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని తాకట్టుపెట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా అన్నారు. బీజేపీ హఠావో- దేశ్ బచావో అనే నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గన్నారపు రమేష్‌తో కలిసి ఇంటింటికి సీపీఐ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, శరత్, గోవర్ధనచారి, ఉప్పల రవి, యాకోబ్, యోగానంద చారి, విక్టోరియా, సుమలత, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నయీంనగర్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులందరికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టి ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు టీవీ.రాజు గౌడ్, జగన్, అశోక్, సురేందర్, గోపాల్, తిలక్ బాబు, రాజేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

ఖిలా వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పసునూరి రాజు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ ఖిలా వరంగల్ మండల డిప్యూటీ తహల్దార్ ప్రవీణ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు 12రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. అలాగే, ఒకరికి 10కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పాణి, మోహన్, ఎల్లయ్య, కట్కూరి వెంకటస్వామి, చిన్నస్వామి పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

హన్మకొండ: టీఎస్‌పీఎస్సీ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని, చైర్మన్, సెక్రటరీ, బోర్డు సభ్యులను అరెస్ట్ చేసి విచారణ జరపాలని ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ అయిత నిఖిల్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో సంఘం సమావేశం గురువారం జరిగింది. మనోజ్, భరత్, శ్రవణ్, హరి చరణ్, వినీష్, దిలీప్, శ్రీనివాస్, రోహిత్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

కాశిబుగ్గ: 20వ డివిజన్ కాశిబుగ్గలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతావనికి రాజ్యాంగం ద్వారా దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, సోమిశెట్టి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

హసన్‌పర్తి: నగరంలోని ఒకటవ డివిజన్ పలివేల్పుల ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేల విలువైన మైక్‌సెట్‌ను ఇన్నర్ వీల్ క్లబ్ వరంగల్ ప్రతినిధులు గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు భార్గవి మాట్లాడుతూ తమ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి లావణ్య, హెచ్ఎం రవికుమార్ పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కాజీపేట: అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిపోయిన వడ్డెర కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెరల ఐక్యత కోసం హనుమకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరగనున్న 2వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పల్లపు రాజేందర్, అయిలయ్య, కస్తూరి రాజు, మంజుల నవీన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి

వరంగల్ అర్బన్: దోమల నివారణకు రోజూ ఫాగింగ్ చేయాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ కోరారు. ఈమేరకు బల్దియా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, సందెల లాజర్, చంద్రమౌళి ఉన్నారు.

గోవిందరాజుల గుట్టపై గోపూజ

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని గోవిందాద్రి గోశాలలో గురువారం గోపూజ నిర్వహించారు. ఈమేరకు గోపాలకృష్ణ ఆరాధాన, ప్రీతి అర్ఘం, పిత పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు వరయోగుల లక్ష్మణస్వామి, దేవాలయ ప్రధాన అర్చకులు వరియోగుల శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు

కేయూ క్యాంపస్: మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఆల్‌మాల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బాధ్యులు డాక్టర్ జగన్మోహన్, రాజేందర్, సురేష్, అనిల్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

హన్మకొండ: కాజీపేట దర్గా క్రాస్‌లోని బన్ను ప్రత్యేక ఆశ్రమ స్కూల్‌లో టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి పల్లపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను గురువారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అర్షనపల్లి విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బన్ను స్కూల్ నిర్వాహకుడు వీరమల్ల కిరణ్ కుమార్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

చార్‌బౌళిలో ఇఫ్తార్‌విందు

వరంగల్ అర్బన్: చార్‌బౌళి నోబుల్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందును వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గురువారం ఏర్పాటు చేశారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

వరంగల్ క్రైం: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి పబ్లిక్‌గార్డెన్ దగ్గర బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం, శాలిపేటకు చెందిన కాసా లక్ష్మణ్‌రావును అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి రూ.4,11,720 నగదు, రూ.45 విలువైన ల్యాప్‌టాప్, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళ హఠాన్మరణం

మడికొండ: కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన గడ్డం రత్తమ్మ (58) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడిపికొండ గ్రామానికి చెందిన గడ్డం రత్తమ్మకు ఇద్దరు కుమారులు గడ్డం మల్లేషం, గడ్డం కార్తీక్ ఇద్దరు తరచుగా గొవలు పడుతుండేవారు. ఈక్రమంలో గురువారం వారిరువురు గొడవలు పడుతుండటంతో.. అది చూసిన రత్తమ్మకు గుండెపోటు వచ్చి మృతి చెందింది. పెద్ద కుమారుడు మల్లేషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు.


అమ్మ ఒడి వాహనం పైలట్‌పై దాడి

ఎంజీఎం : సీకేఎం ఆస్పత్రిలో అమ్మఒడి వాహనం పైలట్‌పై గురువారం ఓ యువకుడు దాడి చేశాడు. పైలట్ జగపతి విధులు ముగించుకుని రికార్డు నమోదు చేసేందుకు బుక్ వెతుకుతూ పక్కనే ఉన్న మహిళను రికార్డు బుక్ చూశారా అని అడిగాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న సదరు మహిళ కుమారుడు జాన్‌పాషా.. పైలట్ జగపతిపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. 102 వాహనాన్ని సైతం ధ్వంసం చేశాడు. దీనిపై బాధితుడు జగపతి అమ్మఒడి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌తోపాటు ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మిర్చి బస్తాలు షెడ్డులోనే నిల్వ చేయాలి

వరంగల్: గురువారం రాత్రి అకాల వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రచార మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నందున వరంగల్ మార్కెట్‌కు మిర్చి బస్తాలు తీసుకువచ్చే రైతులు యార్డుల్లోని షెడ్లలోనే నిల్వ చేయాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఒక ప్రకటనలో తెలిపింది.

బెనిఫిట్స్ ఇప్పించండి



మాట్లాడుతున్న ఉప్పలమ్మ

నయీంనగర్: ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ మరణించిన తన కుమారుడికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని తోటకురి ఉప్పలమ్మ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ కోటకు చెందిన ఉప్పలమ్మ మాట్లాడుతూ సర్వీస్‌లో ఉండి తన కుమారుడు 2010లో మృతి చెందాడని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి బెనిఫిట్స్ రాలేదని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బత్తుల ఉమ, కోటేశం, జనార్దన్, నాగరాజు, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.